# పచ్చగన్నేరు చెట్టు

శ్రీమతి ఉమాశశి

హరి పట్టభద్రుడు అయినా అతనికితగ్గ ఉద్యోగం దొరకలేదు. నాకు హరికి దూరపు చుట్టరికం ఉంది. వరసకి అక్కయ్యనవుతాను. తమ్ముడు రాజుతోపాటు హరికూడా నన్ను అక్కా అనేవాడు. అతని స్వంత అక్కయ్య సుమతికన్న నేనంటేనే గౌరవం. ప్రతిదానికి నన్నే సలహా అడిగేవాడు "ఆవిడంటేనే వాడికి గౌరవం. ఆమె మాటంటే గురి. ఇంక ఎవరిమాటా వినడు" అని వాళ్ళ ఇంట్లోకి కించిత్‌కోపంతో కూడిన అభిమానం.

ఇంతకీ, క్లీనర్ ఉద్యోగంలో చేరిపోయాడు హరి ఓరోజున. ఇంతబతుకూ బతికి క్లీనరుపనిచేయడం ఏమిటని వాళ్ళవాళ్ళకిబాధ. గుంజుకుని, నెత్తీనోరూ మొత్తుకున్నారు వాళ్ళ పెద్దవాళ్ళు.

క్లీనర్ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టడంలోకూడా నాసలహా అడిగి తీసుకున్నాడు హరి. ఉద్యోగం రావడం, వెంటనే చేరిపోవడంకూడా జరిగిపోయింది. వాళ్ళింటిల్లిపాదికీ నామీద బ్రహ్మాండమయినకోపంవచ్చింది. మావాళ్ళూ నన్ను తిట్టారు అధికప్రసంగం చేశానని. చేసివుండవచ్చు కానీ హరి "ఆ ఉద్యోగం దొరికినా చేయాలనివుంది నీ ఉద్దేశంచెప్పు" అని అడిగినప్పుడు అతని అభిప్రాయాన్ని బలపరచడమే నేనుచేసిన తప్పయితే అది తప్పేమరి.

ఉద్యోగంలో చేరినప్పటినుంచీ హరి మాంచి హుషారుగా వున్నాడు. తెలివివుంది, చదువుంది, ఇన్నివున్న అతను కాకీ బట్ట లేసుకుని మురికి ఓడుతూ అధికంగా శ్రమపడుతుంటే చూడడానికి నాకే కొంచెం కష్టంగా వుండేది. ఇంక పాపం, వాళ్లవాళ్లకి ఎలా వుంటుందో!

రోజూ పని ముగించుకుని స్నానపానాదులుచేసి మా ఇంటికి వచ్చేసేవాడు. మా తమ్ముడు, అతను క్లాస్‌మేట్స్. రాజు చదువాపకుండా చదువుకుంటున్నాడు. హరి పొట్టకోసం ఉద్యోగంలో చేరాడు. అతనంటే నా కందుకే అభిమానం. "చదువుకో నేను డబ్బుసాయం చేస్తాను" అన్నా అతను ఒప్పుకోలేదు. రాత్రి పదింటిదాకా నేను, అతను, తమ్ముడు పిల్లలు బట్టి అన్నయ్యలు, అమ్మా నాన్న అందరం అతనిచుట్టూచేరి కబుర్లు చెప్పుకుంటాం. అతను కబుర్లుచెప్పి అయస్కాంతంలా ఆకర్షిస్తాడు అందర్నీ. అతనిలోవున్న గొప్పతనం అదే. అనర్గళంగా ఏ విషయాన్ని గురించైనా చెప్పినది మళ్ళీ చెప్పకుండా ఉపన్యాసం ఇచ్చేస్తాడు. బోర్‌కొట్టదు. వినాలనిపిస్తుంది. కానీ నిద్రకుమాత్రం తట్టుకోలేదు. మాఇంటి గోడ గడియారం తొమ్మిది కొట్టడం ప్రారంభించగానే వెళ్ళిపోయేవాడు ఎంతమంచి విషయం చెప్తున్నాసరే ...

ఆర్నెల్లు గడిచేసరికి మా హరినిగురించి చిత్రవిచిత్రమైన వార్తలు నా చెవినిబడడం మొదలుపెట్టాయి. వయసులోవున్న కుర్రవాడు. ఆ వయసులో ఆ ముచ్చట కాస్త జరిపిస్తే బావుంటుందని వాళ్ళవాళ్ళనుకున్నా అది సాగనివ్వలేదతను. మంచి ఉద్యోగంలో స్థిరపడేదాకా చేసుకోనన్నాడు.

మరి...ఈ వెధవేషాలేమిటి ? చిరాకేసిందినాకు. వెకిలితనం వెకిలి బుద్ధులు అని తిట్టుకున్నాను. ఒకోసారి పిలిచి నాలుగు చివాట్లేద్దామా అని కూడా అనుకున్నాను. కానీ అతని స్వంతవిషయాల్లో పూర్తిగా అటువంటి విషయాల్లో జోక్యం కలుగచేసికోబుద్ధికాలేదు. అతనికామాత్రం బాధ్యత తెలీదా అనుకున్నాను. గౌరవం అనేది ఇచ్చిపుచ్చుకునే వ్యవహారం కదా!

"మాణిక్యంలాంటి పిల్లాడు మట్టికొట్టుకుపోతున్నాడు ఆ వుద్యోగంలోచేరి" అంటూ వాళ్ళ పెద్దవాళ్ళు ... 'అలగా బుద్ధులు వస్తున్నాయి' అంటూ సుమతి గోలగోలగా చెప్పేసుకుంటున్నారు.

సుమతి నన్ను ఓ గంట కూర్చోబెట్టి ఉపన్యాసమిచ్చి "నువ్వు ఈ క్షణంలో మానెయ్యమంటే మానేస్తాడు. ఉద్యోగం మానెయ్యమందూ లలితా ఆ ఉద్యోగం. మరీ అలగాగా ఆ గుడిసెల్లోకంతా రాత్రిళ్ళు దూరుతుంటే చూడలేకపోతున్నాం. వాడికీ పాడు బుద్ధులేమిటో" అంటూ దోమ సంగీతం నా చెవుల్లో అది.

ఉద్యోగానికి, పాడు బుద్ధులకీ సంబంధమేమిటో నాకు తెలీలేదు. అయినా నేనేమీ మాట్లాడలేదు.

ఒకసారిమా తం మాటల సందర్భంలో అన్నాను హరితో.

"ఆ ఉద్యోగం మరీ కష్టంగావుంటే మానెయ్యకూడదూ హరీ" అని.

"నీ రాసలీలలు వినలేక చెవులు చిల్లులు పడుతున్నాయి" అని కుండ బద్దలుకొట్టడానికి నా చదువు, సంస్కారం అడ్డొచ్చాయి.

"మానేస్తానులే. మంచి ఉద్యోగం మరోటి దొరకాలి కదా! అయినా 'బెగర్స్ కెనాట్ బి ఛూసర్స్' కదక్కా" అన్నాడు.

నా మనసు చివుక్కుమంది. అతను బెగ్గరా? హరి ప్రస్టేటడ్‌గా అయిపోతున్నాడు. హరిలాంటి కుర్రాళ్ళెంతమంది ఇలా నిస్పృహ చెందుతున్నారో. బి. ఎలు., ఎం. ఎలు పాసయి ఊరికే గోళ్ళు గిల్లుకుంటూ కూచోటం ఎంత భయంకర పర్యవసానాలకు దారి తీస్తుందో సింహాసనాలమీదఉన్న పెద్దలకి తెలుస్తే బాగుండును.

హరి అల్లాగన్నాక నేనుమాత్రం ఏమంటాను? అతని నడవడి గురించి ఏం మాట్లాడాలో తోచలేదు. కానీ నన్ను నోరుమూసుకోనియ్యకుండా చేసిందో విషయం.

మా పేటకి ఫర్లాంగు దూరంలోనే ఓ కార్ఖానా. అందుకే మా ఇంటి చుట్టుపక్కలంతా కూడా ఎక్కువగా కార్మికజనం. ఆ కార్ఖానాలో పనిచేసేవారే అంతా. మా యింటి ఎదురుగా రెండు పూరిళ్ళు. వాటిమధ్యన ఓ పచ్చగన్నేరు చెట్టు. విశ్రాంతిగా ఆ చెట్టు కింద చేరుతుంటారు జనం. ఓ పూరింట్లో సీత ఉంటుంది. సీతకి రెండు కాళ్ళూ లేవు. అవిటిపిల్ల. వాళ్ళ నాన్న ఫేక్టరీలో కూలి. వాళ్ళమ్మ అక్కడక్కడా పాచి పని చేసుకుంటుంది. ఆమె చాలా తెలివైంది. సీతకన్న చిన్నపిల్ల లిద్దరూ కూలికిపోతారు. సీతే కదలలేనిది. అందుకే సీతచేత ఓ చిన్న చిల్లర దుకాణం పెట్టించింది వాళ్ళమ్మ. కదలక్కరలేకుండా సంపాదించుకోవచ్చు.

సీతకూడా నెమ్మదైన పిల్ల. సీతంటే ఆ పేటవారందరికీ ఇష్టమే. అదేకాదు. ఆ కుటుంబమంతా ఒకరి జోలికివచ్చి పోట్లాటకీ, పోరుకీ వచ్చేవాళ్ళు కాదు. సీత అంతే. ఆ దుకాణం దగ్గరే కూర్చుని నెమ్మదిగా సరుకులమ్ముకుంటుంది. పచ్చగన్నేరు చెట్టునీడలో సీత దుకాణం. అందరూవచ్చి సరుకులు కొనుక్కుని పోతుండేవారు.

అందునా, ఆఖరికి పోకిరీ అబ్బాయిలుకూడా మర్యాదగా కావల్సిన వస్తువులు కొనుక్కెళ్ళేవారు. ఏవైనా చిల్లర వస్తువులు కావల్సినప్పుడు మేము కూడా సీతకొట్టుకెళ్ళి కొనుక్కు తెచ్చుకోడం అలవాటు చేసుకున్నాం. దేక్కుంటూ పనులు చేసుకునిపోయే సీతంటే జాలి, ఆ నేర్పుచూసి నాకు ముచ్చట.

ఓ రోజు సుడిగాలిలా వచ్చింది సుమతి.

"ఈ తేత్యం" అంటూ ప్రారంభించింది రాగానే. అంటే హరన్నమాట. ఈమధ్య అతనికన్నీ అలాంటి ముద్దుపేరే తగిలిస్తోంది సుమతి. నామీద అనవసరంగా ఎగురుతుంది. నేనే అతన్ని పాడు చేశానట. హరి తిరిగే వెధవ తిరుగుళ్ళకు నేనే బాధ్యురాలినట. ఇంక ఒకటేమిటి. ఆఖరికి చెప్పిన మాటలివి.

"దానోత్నూ, దీనోత్నూ పోతున్నాడు; సరే ఖర్మ అని సరిపెట్టుకుంటే వాడు ఈ అవిటిదాని బ్రతుకు ఎట్టేట ముంచేటట్లున్నాడు" అంది.

గతుక్కుమన్నాను.

అప్పుడప్పుడు సిగరెట్లకోసమని ఆదుకాణానికొచ్చి సీతతో కబుర్లేసుకోడం నేను గమనించకపోలేదు. కానీ అతనొకడేనా అవతలి వీధి పైలరు కుర్రాడు. ఇవతలవీధి చాకలి పిల్లాడూ అందరూ అక్కడే బీడీలకోసమని, సిగరెట్లకోసమని ఆగుతూనే వున్నారు. కబురు చెబుతూనే వున్నారు. సీతకూడా అప్పుడప్పుడు నవ్వుతునే సరదాగా వుంటోంది. మరి హరి నొక్కడ్నే అనడమేం?

"ఛ...హరి అటువంటివాడు కాదు" అసహయత్నంగా అన్నాను!

"చూస్తూండు అదేజరుగుతుంది" సుమతికి కసి ఎందుకో అది బాధా?

"అలా తిట్టకపోతే వాడ్ని కాస అదుపులో పెట్టలేవూ?" అన్నాను.

"నేనా? నాతోమాట్లాడ్డు వాడు. మేగీ అని పిలుస్తాడు. అస్తమానూ నేగ్ చేస్తానట" అంది ఉడుకుమోత్తనంగా. నిజమే! సుమతికా నేగింగ్ గుణముంది. విసుగెత్తించేస్తుంది ఎదుటివాళ్ళను సణుగుడుతో.

ఆ సాయంత్రం హరి వచ్చినప్పుడు అతన్ని తీసుకుని డాబామీద కెళ్ళాను. నేనడగదల్చుకున్నది ఎవరూలేకుండా అడగటానికి అనువైన ప్రదేశం.

మాటలమధ్యలో గంభిరంగా అయిపోయి "హరీ, నువ్వెవరితో తిరిగినా నాకు బాధలేదుగానీ ఆ అవిటిదాని బతుకులోమ్మాత్రం ఆడుకోకు" అన్నాను.

తుళ్ళిపడి క్షణంసేపు మాట్లాడలేదు.

"అంత నీచుడ్నికాను" అన్నాడు

నేనూ నొచ్చుకున్నాను అనవసరంగా అతన్ని అనుమానించానేమోనని. అతను చాలా బాధపడ్డాడు నా మాటలకు. మరుక్షణం స్వపటికి లేచి వెళ్ళిపోయాడు.

మరో రెండు రోజులకి అతనికి మద్రాసులో సినిమా కంపెనీలో ఏదో ఉద్యోగం దొరికిందంటూ చెప్పి ఆవూరు వదిలేశాడు హరి.

సీత సంపాదన బాగా పెరిగింది. దానితో సీత తండ్రి చక్కగా చేతిలో డబ్బులుపడేసరికి తాగి తందనాలు, వీధినపడి పోట్లాడు కోవడాలు ఇవన్నీ తయారయాయి.

హరివెళ్ళిన నెల్లాళ్ళకి ఓ వార్త ఆవీధంతా గుప్పుమంది. సీత నెలతప్పిందన్నవార్త, తెల్లబోయాను. సుమతి సాధింపు, ఈవార్త రెండూ నన్నుక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సుమతి అనుమానంలో అర్థంలేదనిపించింది. 'వీడేనేమో' అని దానిభయం. భయంకాదు. అనుమానం. అందరూ గుసగుసలాడుకుంటున్నారుట.

"అందుకే ఈ ఊరినుంచి అంత తొందరగా పారిపోయాడు కాబోలు'' అంటుందది బెంగగా.

నాకీ సస్పెన్స్‌లో తలతిరిగిపోతోంది. సీతనే స్వయంగా అడిగేస్తేగాని ఈ బాధ తీరదునాకు. అందుకే మర్నాడు ఎవరూలేని సమయంకోసం చూస్తున్నాను. ఎప్పుడూ ఎవరో ముగ్గురు నలుగురు సీతచుట్టూ వుంటూనే ఉన్నారు. ఎలా ? ఎలా ? సరే, మర్నాడు తప్పకుండా వీలుచూసుకోవాలనుకున్నాను.

మర్నాడు సీత ఇంటిముందుగోల. తెల్లారేసరికి ఏమిటయింది బాబూ అనుకుంటూ వీధిలోకి వెళ్ళాను. నాగుండె జారిపోయింది. సీత రాత్రే గన్నేరుకాయలుతిని ఆత్మహత్య చేసుకుంది. ఆ సంఘటన హృదయ విదారకం. సమ్మెటపోటులాంటివార్త నన్ను నిలవనీయటం లేదు. అవిటిపిల్ల ఆత్మహత్య చేసుకుందంటే ఎంత దారుణమైన సంగతి!

అందరూ హరినే తిట్టుకుంటున్నారట. మా పనిమనిషి అందించినవార్త.

నా మనసు కలతబారింది. అతనిక్కడలేడుకదా అని అతనిమీద వేసేస్తున్నారు నెపం అని నా ఉద్దేశం.

సుమతి గోల నన్ను మరింత బాధించింది. "ఏం ఉద్యోగం దొరికిందని వీడిట్లా కొంపమునిగినట్లు పారిపోయాడు. వీడేనా సీత ఆత్మహత్యకు కారణం ? ఏమంటావు లలితా ?'' అంటూ గొడవ.

వెళ్ళి నెలయినా హరి ఏ సంగతీ వ్రాయకపోవడం, ఎడ్రసు ఇవ్వకపోవడం నాలోనూ చిన్న అనుమానానికి దారితీసింది. దరిమిలా నాకూ హరిమీద కోపం వచ్చింది.

'క్లీనర్ పని చెయ్యనా వద్దా' అని సలహాకి వచ్చిన హరి ఆ సినిమా కంపెనీకి దరఖాస్తు పెట్టనా వద్దా అని ఎందుకడగలేదు? ప్రశ్నలు, ప్రశ్నలు...లోలోపలే అగ్నిపర్వతంలా ప్రజ్వలిస్తోంది అనుమానం.

మరో పదిరోజులకి హరి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

అక్కా!

కోపంగా ఉందికదూ! ఉత్తరం వ్రాయలేదని. ఏం చెయ్యను నువ్వుకూడా ఆ నాడా ప్రశ్న అడిగి నీచుడిగా జమకట్టావ్. ఆరోజెంతో బాధపడ్డాను. నేను మడికట్టుకు కూర్చున్నానని చెప్పలేను కానీ ఆ సీతతోమాత్రం సంబంధం పెట్టుకోలేదు. ప్రమాణ పూర్తిగా చెప్తున్నాను. ఇది నిజం.

నా ప్రవర్తనవల్ల మీ అందరికీబాధ కలిగించడం ఎందుకనే ఉద్దేశంతో ఈ ఊరొచ్చాను. అప్పుడు ఉద్యోగం దొరకలేదు. కానీ మొన్ననే ఒక మందుల దుకాణంలో పద్దులురాసే పని కుదిరింది. అడ్రసు ఇస్తున్నాను ఇంతవరకు నీకు ఉత్తరం వ్రాయనందుకు నన్ను క్షమిస్తావుకదూ!

నమస్కారాలతో

నీ తమ్ముడు హరి.

ఆ ఉత్తరం చూశాక నా మనసు తెరిపినబడింది. పాపం. నిజంగా హరి తప్పేమీలేదేమో! సీత మరెవరితోనన్నా కాలుజారి ఉంటుంది. అనవసరంగా హరిని అనుమానించాం అనుకున్నాను. అయినా సీత ఆత్మహత్య చేసుకోకుండా ఉండిఉంటే బావుండేది. నిజానిజాలు తెలిసేవి. అప్పుడీ చిత్రవధ ఉండేదికాదు. ఉత్తరం వ్రాసినంత మాత్రాన హరి తప్పులేదని అనుకోడం ఎలాగ? సీత గుర్తుకువస్తే హరి ఇందుకు కారణమేమోననిపిస్తోంది. ఇదో చిక్కు ప్రశ్నగా నిలిచిపోయింది.

ఈప్రశ్నవిడటం కష్టం. విడుపులేని పొడుపుకథఇది. దానికి జవాబు భగవంతుడికి తప్ప మరెవరికీ తెలీదు. సీతలేదు నిజం చెప్పడానికి. పచ్చగన్నేరుచెట్టు ఉన్నా అది నిజం చెప్పలేదు.

అన్నీతెలుసుననుకుని విర్రవీగే మనుషులకి ఇంతేశాస్తి అనుకుంటూ పచ్చగన్నేరుచెట్టు మవునంగా ఉండిపోయింది.